# ప్రాక్టికల్ టెస్ట్

## జనమంచి సోమయాజులు

“చూడు సరోజా, నేను ఇప్పుడే నానీ స్కూలుకెళ్లి లంచి బాక్సు ఇచ్చి తిరిగొస్తాను. రాత్రంతా ప్రయాణంతో నీకు నిద్రలేదు కదా! తలుపులేసుకొని హాయిగా పడుకో” అంటూ విమల వైరుబుట్ట పట్టుకొని బయటకు వచ్చింది. అప్పటికే వాలుకుర్చీలో కునికిపాట్లు పడుతున్న సరోజ “ఒక్కదాన్నే వుండాలి, తొందరగా రా! అక్కా!” అంటూ లోపలి గడియపెట్టుకొని, మంచం మీద పడుకుంది. ఇంతపెద్ద క్వార్టరులో తాను ఒంటరిగా వున్నావన్న భావం, మనసులో కాసేపు కదలాడినా, చల్లటి ఫానుగాలికి వెంటనే నిద్రపట్టింది.

ఆ విధంగా ఎంతసేపు నిద్రపోయిందో, బయటనుంచి ఎవరో తలుపులు దబదబా బాదటం వినిపించి, ఒక్కసారి ఉలిక్కిపడి లేచింది. కరెంట్ పోవటంతో, ఫానుతోపాటు, కాలింగ్ బెల్ కూడా పనిచేయటం లేదు. బయట గదిలోకి వచ్చేసరికి, ఎవరో ఒకతను ఇంతకుముందెప్పుడూ చూడలేదు— సుమారుగా ముప్పై ఏళ్ళు ఉండవచ్చు—బాగా పొడుగ్గా లావుగా ఉన్నాడు. గుబురుగా పెరిగిన గడ్డం, కళ్ళకు రంగుకళ్లద్దాలు— చూడటానికి సినిమాలో విలన్‌లా వున్నాడు. చేతిలో చిన్న సూట్‌కేసు. తాను లేచి రావటం చూసి, తలుపుకొట్టటం ఆపాడు”. పూర్తిగా వదలని నిద్రమత్తుతో, తలుపు ప్రక్కన ఉన్న కిటికీలోంచి, ఆ వ్యక్తివేపు “ఏమిటన్నట్లు” ప్రశ్నార్థకంగా చూసింది. ఒక్కక్షణం సరోజ వైపు కన్నార్పకుండా చూసి “విమల గారు లేరాండి?” అన్నాడతను. “లేరు, బయటికెళ్ళారు” అన్నది సరోజ. “నేను మూర్తి గారి, ఆఫీసు నుండి వస్తున్నాను. వారు ట్రెయిన్ లేటవటంతో, స్టేషను నుంచి, సరాసరి ఆఫీసుకు వచ్చేసారు. ఈ సూట్‌కేసు ఇంట్లో ఇవ్వమన్నారు” అని ఎడం చేతిలో ఉన్న సూట్‌కేసును ఎత్తి చూపించాడు, బయట నిలబడ్డ వ్యక్తి. మూర్తి అంటే విమల భర్త. క్రితం రోజు ఏదో పనిమీద, పక్క ఊరికెళ్ళాడు.

ఇక తప్పదన్నట్లు, లోపలి గడియతీసి, రెండు తలుపులూ పూర్తిగా తీయకుండా, సగం బయటకు వచ్చి, సూటుకేసును లోపలకు తీసుకుపోదామనే వుద్దేశ్యంతో “అక్కడ పెట్టండి” అన్నది సరోజ. బయటవాడిని, లోపలకు రానివ్వటం ఇష్టం లేక.

తన మాట వినిపించనట్లుగా, అతడు ఒక చేత్తో, సగం తెరిచిన తలుపును లోపలికి త్రోసుకుంటూ, గుమ్మంలో ఉన్న సరోజను నెట్టేసినంత పనిచేసి, ఇంటిలోపలికి వెళ్ళిపోయాడు. దెబ్బకు నిద్రమత్తు వదిలి, గుండెదడ మొదలయింది సరోజకు. వెంటనే తేరుకొని “ఏయ్, మిస్టర్ ఏమిటీ దౌర్జన్యం? సూట్‌కేస్ అక్కడ పెట్టమంటే, సరాసరి లోపలికెళ్ళి పోతున్నావ్” అంటూ తను కూడా లోపలికి నడిచింది. ఇదేమీ పట్టనట్లు ఆగంతకుడు, సూట్‌కేసును క్రిందపెట్టి, బెడ్ రూములోకెళ్ళి తొంగిచూశాడు. లోపల ఎవరయినా ఉన్నారేమోనని, నిర్ధారణ చేసుకునేందుకు. అక్కడెవరూ లేకపోవటంతో, చిన్నగా ఈలవేసుకుంటూ, వంటగదివేపు నడిచాడు. ఏంచేయాలో అర్థంగాక, మధ్యగదిలో నిలబడి ఆలోచిస్తోంది సరోజ.

“వీడెవడో ఖచ్చితంగా, దొంగే అయ్యుంటాడు, లోపల ఇంకా ఎవరయినా ఉన్నారేమోనని, అన్నిగదులు వెదుకుతున్నాడు. ఈ ఇల్లు కూడా ఎక్కడో మూలకు విసిరేసినట్లుగా ఉంది. పైగా తను ఇక్కడికి రావటం ఇదే మొదటిసారి. చుట్టు ప్రఎవరితోనూ పరిచయం కూడా లేదు. అక్కా, బావా పేర్ల దగ్గర నుంచీ తెలుసంటే, వీడెవడో ఈ ప్రాంతపు దొంగే అయ్యుంటాడు” అని ఆలోచిస్తున్న సరోజకు వంట ఇంట్లోంచి, గిన్నెల చప్పుడు వినిపించింది. గబగబా, లోపలికి వెళ్ళ యి, ఒక్కసారి ఆగిపోయింది. “లోపలక వెళ్ళింతర్వాత మీదపడి, ఏమయినా అఘాయిత్యం చేస్తే? అమ్మో?” అని అనుకుంటూ మళ్ళీ, బయటి గదిలోకి వచ్చింది. “ఈ ఇంటికి, ఎడం చేతివేపు కొంచెం దూరంలో, ఎవరిదో ఇల్లు కనబడుతోంది. తను గబగబా అక్కడికి వెళ్ళి ఎవరినయినా పిలుచుకువస్తే” బయటకు నడవ యి మళ్ళీ “తాను పోయి వచ్చేలోపల, చేతికందిన దాంతో చల్లగా జారుకుంటాడేమో”నన్న ఆలోచన రావటంతో బయట వరండా దాకా వచ్చి, నిలబడిపోయింది.

బయట రోడ్డుమీద, ఎవరయినా కనబడకపోతారా, పెద్దగా అరిచి పిలవొచ్చుననుకుంటూ రోడ్డువేపు చూస్తూ నిలబడింది.

వంట ఇంట్లో ఫ్లాస్కునిండా కాఫీ వుండేసరికి, తాగబుద్ధయిందేమో, ఒక చేత్తో కాఫీ తాగుతూ, మధ్యగదిలోకి వచ్చి, రెండో చేత్తో బీరువా తలుపు లాగి చూశాడు. తాళం వేసి ఉంది. ప్రక్కనున్న డ్రాయరులాగి, బీరువా తాళాలు బయటికి తీశాడు తాళం తీసి లోపల నుంచి ఒక్కొక్కటి క్రిందకు తీసిపెడుతున్నాడు. కెమేరా, టూ ఇన్ వన్, వెండి సామాను, బంగారపు చంద్రహారం, ఇంకా, ఇంకా... మూటకట్టటానికన్నట్లు, లోపల నుంచి ఒక పెద్ద తుడుగుడ్డను, క్రిందపరచి, అన్నిటినీ దాని మీద మళ్ళీ సర్దుతున్నాడు. “అయిపోయింది, ఇల్లంతా దోచుకుంటున్నాడు” అని మనసులో అనుకుంటుందే గాని నోట్లోంచి మాట పెగిలి బయటకు రావటం లేదు సరోజకు. పట్టపగలు నిలువుదోపిడీ జరుగుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయస్థితి. కాళ్ళల్లో వణుకు ప్రారంభమయింది. ఆగంతకుడు సామాను సర్దుతూనే, సరోజలోని తత్తరపాటును, గమనిస్తున్నాడు.

బీరువాలోని సామాను మూటకట్టడం, పూర్తయింది. డ్రాయరు సొరుగులను ఒక్కొక్కదాన్ని లాగి, ఇంకా ఏమయినా విలువయినవి దొరుకుతాయేమోనని, వెతుకుతున్నాడు. ఏదో ఒకటి

వెయాలనే ఆదుర్దాతో, పోయిన ధైర్యాన్ని కూడ తీసుకొని, సరోజ, గబగబా వీధి గుమ్మం బయటకు వచ్చింది. లోపలున్న మనిషి తదేకంగా ఇటే చూస్తూ, వేదకటం ఆపి, సరోజవైపు రాసాగాడు. అది గమనించి, కనురెప్పపాటులో, బయటి తలుపులు రెండూ, ఒక్కసారి దగ్గరకు లాగి, బయట నుంచి గొళ్ళెం పెట్టింది సరోజ. లోపలున్నవాడు, పెద్దగా అరుస్తూ, తలుపుల్ని తీయాలని గట్టిగాలాగి ప్రయత్నిస్తున్నాడు''. తలుపుల్ని బద్దలు కొడితే తప్ప ఇంటి నుంచి బయటకు రాలేడు. వెనక దొడ్డివేపు నుంచి బయటపడటానికి దారేం లేదు. కాకపోతే, ప్రహరీ గోడదూకి పారిపోవచ్చు'' దానికెట్లాగయినా కొంత టైం పడుతుంది. ఈ లోపల ఎవరినయినా, పిలుచుకురావచ్చు'' అని ఆలోచిస్తూ సరోజ గబగబా, ప్రక్క ఇంటికేసి బయలుదేరింది. నాలుగడుగులు వేసిందో లేదో, అప్పుడే సందు మలుపు తిరిగి, విమల ఎదురుగా వస్తోంది.

## సంబంధం

"ఏమిటి మీ అమ్మాయికి నలభై ఐదు సంవత్సరాల తరువాత పెండ్లి సంబంధం కుదిరిందా? సంతోషం అబ్బాయేం చేస్తున్నాడేంటి?''

"ప్రస్తుతం ఇంటిపట్టు నుండి రెండు చేతులనిండా పెన్షన్ తీసుకుంటున్నాడు!'' అని తెగ మురిసిపోతూ చెప్పాడు.

— డా. ఆర్. విజయకుమార్,

పోయిన ప్రాణం ఒక్కసారి లేచొచ్చినట్లు అయింది. మనిషల్లంత దూరంలో ఉండగానే, జరిగిందంతా వగరుస్తూ చెప్పేసింది. పరుగెత్తినట్లుగా ఇద్దరూ ఇంటి దగ్గరకొచ్చేసరికి, లోపలంతా నిశ్శబ్దం, బయట నుంచి పెట్టిన గొళ్ళెం పెట్టినట్లుగానే ఉంది.

"వెనకనుంచి గోడదూకి పారిపోయాడేమోనని అనుకుంటూ, ఇద్దరూ కిటికీలోంచి లోపలికి తొంగిచూశారు. వాలుకుర్చీలో జారగిలబడి కూర్చున్న వాడల్లా, వీళ్లని చూడటంతో ఒక్కసారి లేచి నిలబడ్డాడు. లోపలున్న మనిషివేపు మరోకసారి తేరిపారచూసి విమల "అదేమిటి, చలపతీ, ఇంత హంగామా చేశావు'' అని నోరు నొక్కుకుంటూ, బయటిగొళ్ళెం తీసి, లోపలికెళుతూ, "పిచ్చిమొహమా, ఇతను మా మరిదే'' అన్నది, తెల్లతూ గుమ్మం బయటే నుంచున్న సరోజతో.

బీరువాలోంచి తీసిన వాటన్నింటినీ, మళ్ళీ యథాస్థానంలో సర్దుతున్నాడు, అప్పటిదాకా దొంగలా ఫోజుకొట్టిన మనిషి.

"ఇది మా పిన్నికూతురు, సరోజ. నిన్న సాయంత్రం ఢిల్లీ నుంచి వచ్చింది. నిన్ను ఇదివరకెప్పుడూ చూడలేదు గదా! నువ్వు ఫలానా అని చెప్పొద్దుటయ్యా'' అన్నది గట్టిగా దబాయిస్తూ.

"వెరీ సారీ వదినా, ఇక్కడికొచ్చేముందు అన్నయ్య ఆఫీసుకెళితే, మీ చెల్లెలొచ్చినట్లు, చెప్పి ఢిల్లీలో ఒంటరిగా ఉంటున్నట్లు, మంచి ధైర్యవంతురాలని, సర్టిఫై చేశాడు. నువ్వు ఇంట్లో లేవనేసరికి, ఏపాటి ధైర్యమున్నదో కనుక్కుందామని చిన్న తమా వేశాను అంతే'' అన్నాడు చలపతి గడ్డాన్ని సవరించుకుంటూ.

సరోజ దగ్గరగా వచ్చి రెండుచేతులు జోడిస్తూ — "నా పేరు చలపతి, కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. మీకే చిన్న ప్రాక్టికల్ టెస్ట్ పెట్టినందుకు క్షమించాలి. నన్ను లోపలివాడిని లోపలే బంధించిన, తిరుగులేని మీ ధైర్యానికి, నా జోహార్లు'' అన్నాడు చలపతి నాటక ఫక్కీలో.

"చూడు అంతటితో సరిపోయింది, సంతోషించు. మా చెల్లెలు కరాటేలో బ్లాక్‌బెల్టు సంపాదించింది. దాని చేయి తడాఖా నీకు, చూపించింది కాదు'' అన్న విమల మాటలకు చలపతి, ఒక్కసారి "అమ్మబా   య్'' అంటూ నెత్తిమీద చేతులెట్టుకున్నాడు. ఆతని యాక్షన్ చూసిన సరోజ ఒక్కసారి ఫక్కుమంది. ●

